
# తీపి గురుతులు

-జిడిగుంట ఉషారాణి



ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

హాల్లోనుండి వినిపిస్తున్న మంత్రాలు, ఇంట్లో జనం మాటలతో కలిసి, ఇల్లంతా అదో రకం సందడి కనిపిస్తోంది. రాజారావుగారు పోయి ఆరోజుకి 11 రోజులు. ఆఖరి రోజున జరిగే తంతును బ్రాహ్మలు ఎంతో నిష్ఠగా, శ్రద్ధగా జరిపిస్తున్నారు. పెద్ద కొడుకు భార్గవ చిన్న కొడుకు ప్రకాష్‌లు బ్రాహ్మలు చెప్పిన విధంగా ఎంతో శ్రద్ధగా ఆసక్తిగా చేస్తున్నారు. అప్పుడప్పుడు ముక్కును తుడుచుకుంటున్నాడు ప్రకాష్. తండ్రి లేని లోటు అతన్ని చాలా కదిలిస్తోంది. అక్కడే గుమ్మంలోనుండి నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తోంది చిన్న కోడలు హరిణి. "తండ్రిలాంటి మావగారు పోయి ఈ రోజుకి పదకొండవ రోజు. ఒక మనిషి నిష్క్రమణం జీవితాల్లో ఎంత ప్రభావం చూపిస్తుందో ఆ మనుష్యులని బట్టి ఉంటుందేమో. ఇంట్లో శుభకార్యాలు జరిగినపుడు పట్టుపంచెతో ఎంతో హడావిడిగా తిరిగేస్తూ, అందర్నీ తొందరగా పనులు తెమిలేటట్లు చేస్తుండేవారు మావగారు. ఈరోజు కూడా ఆయన అలాగే తిరుగుతున్నారేమో. బ్రాహ్మల్ని కంగారు పెట్టరేం? అనుకోగానే ఆమెకి కన్నీళ్ళు జలజలా రాలిపోయాయి. ఆమె చప్పున నీళ్ళు తుడుచుకుని అత్తగారు ఎక్కడుందో వెదికింది. వంటింట్లో వంట వాళ్ళని అజమాయిస్తూ కన్పించింది అన్నపూర్ణ. "సుభద్రగారూ! మినప్పిండి మెత్తగా కాటుకలా రుబ్బారా? మిక్సీలో చేస్తే ఆయనకిష్టముండదు. గార్లు దూదుల్లా నోట్లో వేసుకుంటే కరిగిపోవాలంటారు. ఆఁఇదుగో వెంకాయమ్మగారూ! చిక్కుడుకాయ పులుసు బెల్లంపెట్టి వండండి. ముక్కల్లో పులుసు, బెల్లం బాగా ఉడికాక పోపులో నుండి తీసిన ఎండుమిర్చి ముక్కలు బియ్యం పిండితో నలిపి వేయండి. అపుడు కూర బాగా హత్తుకుని రుచిగా ఉంటుంది" అని చెప్పి హాల్లోకి తిరిగి వచ్చిందావిడ. భర్త పోయి పదకొండు రోజులకే ఆవిడ అలా తిరిగేయడం, హడావిడి పడటం వంటవాళ్ళకి విచిత్రంగా అన్పించింది. 'లోకం పోకడ' అనుకున్నారు. చుట్టాల్లో చాలామందికి అన్నపూర్ణ ప్రవర్తన వింతగానే ఉంది. కూతుళ్ళు "తల్లి తెచ్చిపెట్టుకున్న ప్రవర్తన" అనుకున్నారు. హరిణికి మాత్రం అత్తగారి పద్ధతి నచ్చటంలేదు. అత్తమామల అన్యోన్యత తనకి బాగా తెలుసు. పెళ్ళయి ఏడేళ్ళ నుండి తను చూస్తూనే ఉంది. బ్యాంక్‌లో చేస్తున్న ప్రకాష్ లోన్‌తో, రాజారావు రిటయిరయ్యాక వచ్చిన డబ్బుతో మూడు బెడ్రూముల ఇల్లు కట్టుకున్నారు. ఆ ఇల్లు అంటే రావుగార్కి ఎంతో మక్కువ. అత్తా మామలు ఇద్దర్కి తనంటే ఎంత అభిమానమో తనకి తెలియంది కాదు. ఉదయం వంట అన్నపూర్ణ చేసినా, సాయంత్రం హరిణీ చేసేది. వేపుడు అంటే రావుగార్కి ప్రీతి. రోజుకో రకం వేపుడు హరిణితో చేయించుకునేవారు.

"ఊఁ! తినండి తినండి. 'కొలస్ట్రాల్' పెరిగితే తెలిసొస్తుంది" అనేది అన్నపూర్ణ నవ్వుతూ.

"పోనీ అత్తయ్యా! మావయ్యగార్కి ఏ చెడ్డ అలవాట్లు లేవు. బజ్జీలు, పకోడీలు ఎక్కువ తిననే తినరు. కొలస్ట్రాల్ ఏమీ ఉండదు లేండి" అని మావగార్ని వెనకేసుకొచ్చేది. ఇప్పుడేం చేస్తావ్?" అన్నట్లు భార్య వంక నవ్వుతూ చూసేవారు.

"వడల మాట కోడలు మర్చినట్టుంది. అవే వెయ్యి బజ్జీల పెట్టు" మూతి తిప్పుకుంటూ అనేది అన్నపూర్ణ. ఆవిడ అనటం కాదుకానీ గార్లు అలా మూకుట్లో వేయిస్తుండటం ఏంటీ ఇలా ప్రక్కన కూర్చుని ఆరగించడం ఏంటీ? రావుగార్కి వేడి వేడి 'మినపగార్లు' అంటే మహా ఇష్టం. తిండి విషయంలో అప్పుడప్పుడు ఇలా వాదించుకుంటూ ఉన్నప్పటికీ ఇద్దరి అభిరుచులు, అభిప్రాయాలు ఒకటే. ఒక్క విషయం మీదనయినా అభిప్రాయ బేధాలుండేవి కావు. సాయంత్రం ఆరుగంటలకల్లా పార్కులకో, గుళ్ళకో వెళ్ళి రెండుగంటల పాటు తిరిగి వచ్చేవారు.

వచ్చి స్నానాలు అయ్యాకా, కోడలు వంట చేస్తోంటే పిల్లలని దగ్గర కూర్చోబెట్టి 'హోమ్‌వర్క్' చేయిస్తూ, టి.వి.లో సీరియల్స్ చూస్తూ గడిపేవారు. ప్రకాష్ ఆఫీసునుండి వచ్చి తల్లిదండ్రుల దగ్గర కాస్సేపు గడిపి, తన పనులు చేసుకునేవాడు. రాత్రి భోజనం అందరూ ఒకేసారి కూర్చుని చేసేవారు. ఎంతో సరదాగా, ఆడుతూ పాడుతూ గడిచిపోయిన రోజులవి. రావుగారి మరణం ఆ ఇంటి ఆనందాన్ని హరించివేసింది. అత్తగారు

పెళ్ళయి ఏడేళ్ళనుండి తను చూస్తూనే ఉంది. బ్యాంక్‌లో చేస్తున్న ప్రకాష్ లోన్‌తో, రాజారావు రిటయిరయ్యాక వచ్చిన డబ్బుతో మూడు బెడ్రూముల ఇల్లు కట్టుకున్నారు. ఆ ఇల్లు అంటే రావుగార్కి ఎంతో మక్కువ. అత్తా మామలు ఇద్దర్కి తనంటే ఎంత అభిమానమో తనకి తెలియంది కాదు. ఉదయం వంట అన్నపూర్ణ చేసినా, సాయంత్రం హరిణీ చేసేది. వేపుడు అంటే రావుగార్కి ప్రీతి.

ఈ వార్త విన్నాక ఎలా తట్టుకుంటుందోనని చాలా భయం, ఆదుర్దాతో కంపించిపోయింది హరిణి. మూడునాలుగు రోజులు ఏడుస్తూ స్థబ్దుగా ఉండిపోయిన అన్నపూర్ణ హఠాత్తుగా ఐదవరోజు నుండి అందరితో కలివిడిగా మాట్లాడటం మొదలుపెట్టింది. హరిణి ఈ 'షాక్' నుండి తేరుకోలేదు. తనకి మావగారితో ఏడేళ్ళ బంధం మాత్రమే. కానీ అత్తయ్యకి నలభయి ఏళ్ళ సహచర్యం. ఆవిడ అంత తొందరగా బాధనుండి కోలుకోవడం, హరిణి మనస్సుకు నచ్చచెప్పుకోలేకపోతోంది.

తోడికోడలు ఇందిరతో అంది కూడ. "ఆ ఈరోజుల్లో అంత మూలకి దాక్కుని ఎవరుంటున్నారు లెద్దూ! నయమేకదూ! ఆవిడ అలా ఏడుస్తూ కూర్చుంటే, మనకి మాత్రం తోస్తుందా! కొడుకులు తట్టుకునేవారా!" అని తేల్చేసింది.

ఆమెకి అత్తామామలతో చుట్టం చూపుగా ఉండే సంబంధమే. రాజారావుగారు స్వంత ఇంటిని వదిలి ఎక్కడకి వెళ్ళినా రెండురోజుల్లో తిరిగి వచ్చేసేవారు. ఆయనతోబాటూ అన్నపూర్ణ కూడా. తోడికోడలు అలా తేల్చేసాక, ఆడపడుచులిద్దరూ తల్లి అంత తొందరగా కోలుకుని, నలుగురి లోకి వచ్చిపడటంతో ఎంతో సంతోషించినట్టు కనబడడంతో, తనే విపరీతంగా ఆలోచిస్తుందేమో అన్పించింది హరిణికి. కానీ ప్రాణసమానుడైన భర్త మరణాన్ని అంత తేలికగా తీసుకోవడం ఆమెకి నచ్చలేదు. పన్నెండవరోజు బంధువులందరూ వెళ్ళిపోయారు.

పదమూడవ రోజు కూతుళ్ళిద్దరూ పరమాన్నం తిని బయల్దేరుతూ "తల్లిని తమతో వచ్చి కొన్నాళ్ళు ఉండి వెళ్ళవలసిందని" అని అడిగారు.

"సంవత్సరికాలు అయ్యేలోగా వస్తానని, ఇపుడు ఎక్కడకీ రాలేనని" నిక్కచ్చిగా చెప్పేసింది అన్నపూర్ణ. ప్రకాష్‌కి కూడా తల్లి కొంతకాలం తిరిగి వస్తే బాగుండనిపించింది. అన్నగారి వంక చూసాడు ఏమంటావన్నట్టు. "అమ్మ చెప్పింది నిజమేరా ప్రకాష్! ఆవిడకి నీ దగ్గర, ఈ ఇంట్లోనే నిశ్చింతగా ఉంటుంది. ఆవిడ ఇష్టప్రకారమే చేద్దాం. మాతో చెన్నై వచ్చినా ఆవిడ ఉండలేదు. నీకు డబ్బు ఏమైనా అవసరం అయితే ఫోన్ చేయి" అన్నాడు తమ్ముడి భుజంపై అనునయంగా చేయివేసి. ప్రకాష్ మౌనంగా ఉండిపోయాడు. నిజానికి తండ్రి పోగానే తల్లిని పంపివేయాలనే దుర్బుద్ధి లేదతనికి. తండ్రి తిరుగాడిన పరిసరాలు తల్లిని బాధిస్తాయేమో, కొంతకాలం వాటికి దూరంగాఉంటే తొందరగా కోలుకుంటుందనుకున్నాడు. తల్లికిష్టం లేని పని చేసే ఉద్దేశ్యమే లేదతనికి.

అందరూ ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోయారు. పధ్నాలుగోరోజు కూడా ఇంట్లోనే ఉండదల్చుకున్న ప్రకాష్ దగ్గరకొచ్చింది అన్నపూర్ణ. "చిన్నా! నువ్వు ఆఫీసుకెళ్ళిపో నాన్నా! లీవులు ఎందుకు వేస్టు చేసుకోవడం? నువ్వు మళ్ళీ మామూలు రొటీన్‌లోకి వస్తే నాకు సంతోషంగా ఉంటుంది. టిఫిన్ తయారయిపోయింది. త్వరగా స్నానంచేసి బయల్దేరు" అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయిందావిడ. తల్లి మాటకు ఎదురుచెప్పే అలవాటే లేని ప్రకాష్ తయారయ్యాడు. సాయంత్రం రోజుకన్నా తొందరగా వచ్చేసాడు ప్రకాష్. నిజానికి అతను ఆఫీసులో ఉండలేకపోయాడు. అనుక్షణం తండ్రే గుర్తువస్తున్నాడు. ఆరోగ్యంగా, హాయిగా తిరుగుతూనే హార్ట్ ఫెయిలయి హఠాత్తుగా ప్రాణంపోయింది. ఎవ్వరూ ఊహించని, ఎదురు చూడని 'షాక్'ఇది. సహజంగా 'బేల'అయిన అతను తట్టుకోలేకపోతున్నాడు. తను బాధపడుతూ కూర్చుంటే తల్లి మరింత దుఃఖపడ్తుందని, లేని గాంభీర్యాన్ని తెచ్చుకుని తిరుగుతున్నాడు.

సాయంత్రం అతను రావడం చూసిన అన్నపూర్ణ చదువుకుంటున్న పిల్లలిదగ్గిరకొచ్చి కూర్చుంటూ "ఏం చేస్తున్నార్రా! రండి! చిన్ని కృష్ణలీలలు' చెప్తాను" అంది హుషారుగా వాళ్ళని దగ్గరకి తీసుకుని. అవి ఎన్ని సార్లు విన్నా పిల్లలకి ఆనందమే. బామ్మదగ్గరకి చేరారు



వాడికి నేనన్నా, వాళ్ళ నాన్న అన్నా పంచప్రాణాలు. నీకు తెలియంది కాదు. తండ్రి అలా హఠాత్తుగా పోవడం వాడు తట్టుకోలేకపోతున్నాడు. ఆ కళ్ళు ఎంత బేలగా, దిగులుతో గూడుకట్టుకున్నట్లు లేవూ! వాడి హుషారు అన్నీ మాయమయిపోయాయి. నేను అలా దిగులుగానే ఏడుస్తూ కూర్చుంటే వాడు పిచ్చివాడు అయిపోతాడు హరిణీ! వాడికి భార్యా, పిల్లలు, సంసారం, ఉద్యోగం ఉన్నాయి. ఎంతో భవిష్యత్తు ఉంది.

వాళ్ళు. ప్రకాష్ లోపలికొచ్చేసర్కి తల్లి పిల్లలతో చేతులూపుకుంటూ కథ చెప్తోంది. అతనికెంతో హాయిగా, రిలీఫ్‌గా అన్పించింది. అతను చప్పుడు చేయకుండా వంటింట్లోకి నడిచాడు. కత్తిపీట ముందు వేసుకుని బెండకాయలు తరుగుతోంది హరిణి. ఆమె కళ్ళవెంబడి నీళ్ళు. భర్తని చూసి కళ్ళు తుడుచుకుంది. "అదేంటి? ఉల్లిపాయలు తరగకుండానే ఆ కన్నీళ్ళేమిటి?" అన్నాడతను ప్రక్కన కూర్చుంటూ ఆశ్చర్యంగా.

"మావయ్యగార్కి బెండకాయ వేపుడంటే చాలా ఇష్టం. నా వాటాకే పావుకేజీ వేయించమ్మా! అనేవారు. ఈరోజు అత్తయ్య ఇవే చేయమని చెప్పేరు. అత్తయ్య అంత తొందరగా పిల్లలతో కల్సిపోయి ఎలా మాట్లాడుతోందో చూసారా? అమ్మ దిగులుగా ఉందని పరిగెత్తుకొచ్చారు మీరు? ఆవిడ ప్రవర్తన విడ్డూరంగా ఉందండీ. నాకే మావగారి జ్ఞాపకాలు ఇంత బాధ కల్గిస్తున్నాయే! ఆవిడ అంత తొందరగా ఎలా మర్చిపోయింది?" అంది వణుకుతున్న గొంతుతో. ఆమె గొంతులో కొంత ఉక్రోషం కూడా ధ్వనించింది.

"ఆవిడ ప్రవర్తనకి దిగులుపడ్తున్నావా హరిణీ!" ఆశ్చర్యంగా అడిగాడు. "కాదండీ! రోజూ ఈ సమయాన్ని ఇద్దరూ గుళ్ళకి, పార్కులకి వెళ్ళేవారు. రెండుగంటలు సరదాగా తిరిగి వచ్చేవారు. అవన్నీ గుర్తుకురావడం లేదా ఆవిడకి. ఎంత అన్యోన్యంగా ఉండేవారిద్దరూ! ప్రాణ సమానుడైన భర్తపోయి పదిహేను రోజులు కాలేదు. కొన్నేళ్ళయినట్లుంది ఆవిడ ప్రవర్తన" అంటుండగానే ఏడుపు వచ్చేసింది హరిణికి.

"ఏయ్! ఏంటీ పిచ్చిపనీ! ముందు కళ్ళు తుడుచుకో" అంటూనే అతను కూడా ఒక్కసారిగా ఏడ్చేసాడు. ఉదయంనుండి గుండెలో దాచుకున్న బాధంతా కన్నీటి రూపంలో బైటకొచ్చేసింది. అతనే ముందు తేరుకుని "హరిణీ! లే! లేచి మొహం కడుక్కుని నాకు, అమ్మకి కాఫీ తీసుకురా! అమ్మ చూస్తే బాధపడ్తుంది"అని గబగబా బాత్రూములోకెళ్ళిపోయాడు. అత్తగారు ఏం చేస్తుందో అని కళ్ళు గట్టిగా తుడుచుకుని ఆవిడ పెరట్లో ఉండటం చూసి దగ్గరకెళ్ళింది. అక్కడే వేసిన మంచంపై కూర్చుని ఆవిడ వెక్కివెక్కి గుండెలు పగిలేలా ఏడుస్తోంది. "అత్తయ్యా!"అంటూ ఆవిడ దగ్గరకి పరిగెత్తి ఒళ్ళోకి తీసుకుంది హరిణి. "హరిణీ! అనుకోకుండా మీరిద్దరూ మాట్లాడుకున్న మాటలు విన్నానమ్మా? నేను బాధపడటం లేదనేకదా నీ దిగులు. ఆయిన పోయినప్పటి నుండి రాత్రిళ్ళు ఎంత గుండె పగిలేలా ఏడుస్తున్నానో ఆ దేవుడికే తెలుసు. ప్రకాష్ హృదయం చాలా సున్నితం. వాడికి నేనన్నా, వాళ్ళ నాన్న అన్నా పంచప్రాణాలు. నీకు తెలియంది కాదు. తండ్రి అలా హఠాత్తుగా పోవడం వాడు తట్టుకోలేకపోతున్నాడు. ఆ కళ్ళు ఎంత బేలగా, దిగులుతో గూడుకట్టుకున్నట్లు లేవూ! వాడి హుషారు అన్నీ మాయమయిపోయాయి. నేను అలా దిగులుగానే ఏడుస్తూ కూర్చుంటే వాడు పిచ్చివాడు అయిపోతాడు హరిణీ! వాడికి భార్యా, పిల్లలు, సంసారం, ఉద్యోగం ఉన్నాయి. ఎంతో భవిష్యత్తు ఉంది. నేను ధైర్యంగా ఉంటేనే వాడు తొందరగా కోలుకుంటాడు. పోయినవాళ్ళు తిరిగి రారు. ఆత్రేయగారు అన్నట్లు వారు వదిలివెళ్ళిన జ్ఞాపకాలే మనకి తీపి గురుతులు. మా మావగారు వదిలి వెళ్ళిన ఈ ఇల్లు పరిసరాలు, నాతో గడిపిన ప్రతీ నిముషం నాకు మధుర స్మృతులు హరిణీ! వాటితోనే నేను కాలం గడపగలను. అలా అని, ఆయనకి చివరిక్షణాల్లో మాట ఇచ్చాను.

ఆయన మరణం నన్ను కుంగదీసినా, ప్రకాష్, వాడి కుటుంబం నాకు కావాలి. అందుకే దుఃఖాన్ని అణచుకుని బతుకుతున్నానమ్మా" అంది హరిణిని దగ్గరకు తీసుకుంటూ.

రెండు చేతులు జోడించి అత్తగార్కి నమస్కరించింది హరిణి! ఆమె ఆవిడకి మేనకోడలు కూడ. "నన్ను క్షమించు అత్తయ్యా! కొండంత బాధని పిడికెడంత గుండెలో దాచుకుని మేరుపర్వతంలా గడుపుతున్నావు. మరి నేను ఉన్న కాస్త బాధను ఆయన దగ్గర ప్రదర్శించి ఆయనని మరింత బాధపెడ్తున్నాను. నేను ఎంత తప్పుగా ఆలోచించానో తెల్సింది అత్తయ్యా. నన్ను క్షమించు" కాళ్ళపై పడిపోయింది హరిణి. "పిచ్చిదానా! లే... లే... వాడు వచ్చి వింటే బాగుండదు. బెండకాయలు నేను తరుగుతాను కానీ నువ్వు కాఫీ కలుపు. పద- పద" ఇద్దరూ వంటింట్లోకి నడిచారు.

'బాత్రూమ్ నుండి వచ్చిన ప్రకాష్‌కి అత్తాకోడళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ పనిచేసుకోవడం గమనించి, కన్నీళ్ళతో కడుపులో బాధంతా దిగిపోవడంతో ఎంతో రిలీఫ్‌గా హాల్లోకి నడిచాడు.' ★